క్లుప్తంగా

15 నుంచి బాబా ఆలయ వార్షికోత్సవం

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ దత్త పరంపర షిర్డీ సాయిబాబా మందిరం 14వ వార్షిక వేడుకలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న బాబావారికి అభిషేకాలు, విశేష అలంకరణ, 16న 108 సార్లు సిద్ధ మంగళ స్తోత్రం పారాయణం, 17న వార్షికోత్సవ మహోత్సవం, భక్తుల స్వహస్తాలతో బాబా వారికి 18 రకాల అభిషేకాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం విజయవాడకు చెందిన శ్రీ అఖిలాండ అఖండ జ్యోతి వ్యవస్థాపకుడు పూజ్యశ్రీ రాంజీ గురువు నేతృత్వంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం, వర్షవర్ధిని హోమం, శ్రీ సాయి శరణాగతి హోమం, శ్రీ దత్త హోమం, శ్రీ గాయత్రి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పంట కాలువలో పూడిక తీత



మండవల్లి: మండలంలోని లోకుమూడి పంట కాలువలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నట్లు ఎంటీఏ ఎస్ నవీన్ పేర్కొన్నారు. రూ.56 వేలతో 34 మంది కూలీలు గురువారం పనులు చేసినట్లు తెలిపారు. ఉపాధి పనుల ద్వారా కాలువల్లో నీటి పారుదల బాగా జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో ఆ నీటిని పంట పొలాలకు రైతులు వినియోగించుకోవడంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని తెలిపారు.

ఘనంగా నిర్వీకల్పానంద స్వామి ఆరాధనా మహోత్సవాలు



గుడివాడ టౌన్: స్థానిక దనియాల పేటలోని ప్రణవాశ్రమంలో శ్రీ నిర్వీకల్పానంద భారతీ స్వామి వారి 20వ ఆరాధనా మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రణవాశ్రమ పీఠాధిపతి శ్రీ స్థైర్యానంద సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వీకల్పానంద భారతి స్వామి విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థైర్యానంద సరస్వతి స్వామి వారు మాట్లాడుతూ కల్పానంద స్వామి వారి దీవెనలు పట్టణ ప్రజలపై మెండుగా ఉండాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రణవాశ్రమ మేనేజర్ ఆర్.వేణుబాబు, భక్తులు పి.చంద్రశేఖర్, ఆర్.శివప్రసాద్, ఎ. మల్లికార్జునరావు, ఎస్.శేషగిరిరావు, ఎం.వెంకట్రావు, ప్రణవాశ్రమ అర్చకులు పి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



గుడివాడ టౌన్: స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో వ్యాయామ ఉపాధ్యాయుల వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో ఎస్.నాగేశ్వరరావు జట్టు ప్రథమ స్థానంలో నిలవగా వై.కిరణ్‌కుమార్ జట్టు ద్వితీయ స్థానం, మృత్యుంజయరావు జట్టు తృతీయ స్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు మాట్లాడుతూ వేసవి సెలవల అనంతరం తిరిగి పాఠశాలలకు వెళుతున్న నేపథ్యంలో ఫిట్‌నెస్ తగ్గకుండా వ్యాయామ ఉపాధ్యాయుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు అన్ని విధాలా సహకరించిన విజయానంద జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల యాజమాన్యానికి వ్యాయామ ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోటీలకు గుంటూరు ప్రసాదు, జె. శ్రీనివాసరావు, సీహెచ్ రవి, ఎం. రాంబాబు ఎంపైర్లుగా వ్యవహరించినట్లు తెలిపారు.

కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలి

గన్నవరం రూరల్: మామిడి రైతులు కొమ్మ కత్తిరింపులు చేసుకోవాలని మండల హార్టీకల్చర్ ఇన్‌చార్జి అధికారి హరిచంద్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులు చేసుకుంటే, చెట్లకు ఎండ, గాలి బాగా తగులుతుందని చెప్పారు. అదేవిధంగా ఎండిపోయిన కొమ్మలను వెంటనే తొలగించుకోవాలన్నారు. మామిడి చెట్లకు హాని చేసే క్రిమి కీటకాలు ఎండు పుల్లల్లో ఉంటాయన్నారు. అందుకే ఎండిన కొమ్మలను ఎప్పటికప్పుడు తీసివేయాలన్నారు. ఈ కారణంగా చెట్లు ఆరోగ్యవంతంగా ఉంటాయని వివరించారు. మంచి పూత వచ్చేందుకు ఈ సస్యరక్షణ చేసుకోవడం అవసరమని తెలిపారు. వాలిన కొమ్మలు తీసివేయడం ద్వారా మేలు కలుగుతుందని పేర్కొన్నారు.

బడి గంట మోగింది

అన్ని పాఠశాలలు ప్రారంభం



గుడివాడ ఎస్పీఎస్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉత్సాహంగా చిన్నారులు

గుడివాడ టౌన్: వేసవి సెలవలు ముగిసి విద్యాసంవత్సరం ప్రారంభంలో భాగంగా గుడివాడ పురపాలక సంఘ పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గురువారం తెరచి తరగతులు ప్రారంభించారు. సెలవుల అనంతరం కలుసుకున్న స్నేహితులు, సహచర విద్యార్థులు పాఠశాలల ప్రాంగణంలో హుషారుగా కనిపించారు. కొత్త తరగతుల్లో ప్రవేశిస్తున్న సంతోషాన్ని వ్యక్తంచేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా కనిపించారు.

పాఠశాలలకు పుస్తకాలు రెడీ

గుడివాడ టౌన్: పాఠశాలలు పునఃప్రారంభించడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రి పంపిణీ ప్రారంభించినట్లు ఎంఈఓ-2 బి. బాలాజీ గురువారం తెలిపారు. స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో భద్రపర్చిన మెటీరియల్‌ను సంబంధిత పాఠశాలల ప్రతినిధులకు పంపిణీ ప్రారంభించామన్నారు. గుడివాడ అర్బన్, రూరల్ మండలాలకు సంబంధించి వివిధ తరగతులకు చెందిన 9,027 మంది విద్యార్థులకు షూస్, బెల్ట్, బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, డిక్షనరీలు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే నాల్గవ వంతు మెటీరియల్ పాఠశాలలకు తరలించామన్నారు. రెండు రోజుల్లో అన్ని పాఠశాలలకు మెటీరియల్ చేరుతుందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు అయా తరగతుల విద్యార్థులకు వీటిని పంపిణీ చేస్తారని తెలిపారు.

ఉత్సాహంగా పాఠశాలలకు

ముదినేపల్లి రూరల్: వేసవి సెలవుల తరువాత ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభంకావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రెండు రోజులుగా పాఠశాలలను శుభ్రం చేసి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సైతం ప్రారంభం రోజు నుంచే అమలు చేశారు. గత విద్యా సంవత్సరంలో 5, 7 తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సమీపంలోని జెడ్పీ హైస్కూల్లో చేరేందుకు తల్లిదండ్రుల సమక్షంలో రికార్డు షీట్లను అందజేశారు.



మాంటిస్సోరి పాఠశాలలో ఉపాధ్యాయులకు బుక్స్, మెటీరియల్ అందజేస్తున్న అధికారులు

మొవ్వలో..

మొవ్వ: వేసవి సెలవుల ముగించుకుని విద్యార్థులు గురువారం ఉత్సాహంగా కేరింతలు కొట్టుకుంటూ పాఠశాలలకు హాజరయ్యారు. మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత, మూడు ఎంపీయూపీ, 47 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు ఒక ఎయిడెడ్ పాఠశాలలో 2,900 విద్యార్థులు ఉండగా తొలి రోజు 1,550 మంది పాఠశాలలకు హాజరైనట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.



మొవ్వలో పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులు



నరసన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి రికార్డు షీటు అందిస్తున్న ఉపాధ్యాయుడు

ఘనంగా 'మన అంగన్‌వాడీ పిలుస్తోంది'



నిభానుపూడిలో ప్రాథమిక పాఠశాల్లో చేరే విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

నిభానుపూడి(పామర్రు): పామర్రు మండలం నిమ్మకూరు సచివాలయం పరిధిలోని నిభానుపూడి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ మూడు ఏళ్ల వచ్చిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీలలో చిన్నారులకు అన్ని రకాల ఆటలు, సృజనాత్మక పెంపొందించే విధంగా చదువు, పాటలను నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీలలో ఐదేళ్లు నిండిన చిన్నారులను స్థానిక ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డెక్కా కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.సత్యశ్రీ, వార్డుమెంబర్ డెక్కా భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పీ ప్రవీణ, ఎం జయశ్రీ, జీ జీవము పాల్గొన్నారు.

రాపర్లలో ..

పామర్రు ప్రాజెక్టు పరిధిలోని రాపర్ల, ఉంద్రపూడి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ బడిబాటకార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీలలో చేర్చుకోవడం, ఐదేళ్లు నిండిన చిన్నారులను స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సీ అనూష, ఓ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

కొండిపర్రులో..

గ్రామంలోని అంగన్‌వాడీ–1లో అంగన్‌వాడీపిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త డి.నాగలక్ష్మి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



రాపర్ల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, చిన్నారులతో సూపర్‌వైజర్ విజయకుమారి



కొండిపర్రులో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న చిన్నారులు



తోట్లవల్లూరులో గ్రాడ్యుయేషన్ డే..

తోట్లవల్లూరులో గ్రాడ్యుయేషన్ డే

తోట్లవల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే గురువారం ఘనంగా జరిగింది. మండలంలోని యాకమూరు, భద్రిరాజుపాలెం గ్రామాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలలకు ప్రమోట్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త సువర్ణలత, పాఠశాల హెచ్‌ఎం మహ్మద్ షమీమ్, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, పలువురు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

విత్తనాల నాణ్యతను పరీక్షించుకోవాలి

కైకలూరు: సార్వా సీజన్లో విత్తనాలు చల్లే ముందు నాణ్యత పరీక్షలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఎం.ఉషాకుమారి, కైకలూరు డివిజన్ ఏడీఏ ఆర్ గంగాధరరావు తెలిపారు. మండలంలోని తామరకొల్లు, వింజరం గ్రామాల్లో రైతుభరోసా కేంద్రం వద్ద సార్వా సాగుకు సంబంధించి రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ విత్తనాలను చల్లేముందు విధిగా మొలక శాతాన్ని పరీక్షించుకోవాలన్నారు. తెగుళ్లు, పురుగులు ఆశించకుండా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ఇందుకోసం కిలో వరివిత్తనాలకు మూడు గ్రాముల కార్బన్‌డిజం మందును కలిపి 24 గంటల తరువాత చల్లుకోవాలని సూచించారు. మండలంలో ముంపు, చవుడు నేలలు ఎక్కువగా ఉన్నందున వీటిని తట్టుకునే వరి వంగడాలను సాగు చేసుకోవాలన్నారు. అనంతరం సబ్సిడీపై ఎంటీయూ–7029, 1318 రకం వరివిత్తనాలను అందజేశారు. మండల వ్యవసాయాధికారి ఆర్ దివ్య, వీఏఏలు పాల్గొన్నారు.



తామరకొల్లులో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

చిన్నారులను అంగనవాడీల్లో చేర్పించాలి

పమిడిముక్కల: మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూపర్‌వైజర్ ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. కృష్ణాపురం కొత్త ఎస్సీ కాలనీలోని అంగనవాడీ కేంద్రంలో గురువారం అంగనవాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల తొలి దశ అంగనవాడీ కేంద్రాలతో ప్రారంభమవుతుందన్నారు. ఈ కేంద్రాల్లో అందించే ప్రీ స్కూల్ మెటీరియల్ పిల్లల మేధాశక్తి అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జయలక్ష్మి, కోటయ్య, అంగనవాడీ కార్యకర్త ఆనందకుమారి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఝాన్సీరాణి

ఘనంగా గంగానమ్మ సంబరం

మత్రిపాలెం(నాగాయలంక): శ్రీగంగానమ్మతల్లి నెల సంబరం బుధవారం రాత్రి, గురువారం కోలాహలంగా సాగింది. గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్లపై రూపొందించిన ప్రత్యేక మందిరాలను డప్పు నృత్యాలు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ఊరేగింపుగా గంగానమ్మ గుడికి తరలివెళ్లారు. గ్రామంలోని హనుమాన్ చాలీసా భజనల ఆధ్యాత్మిక గురువు గుండాబత్తుని వెంకట ప్రసాద్, భువన్ ఆధ్వర్యాన నిర్మించిన అమ్మవారి మండపం భక్తులను అలరించింది. మందిరంతో పాటు బాపట్ల జిల్లా మూర్తోటకు చెందిన గౌరీశంకర్ స్వామి బృందం ఆలపించిన భక్తి గీతాలు, డప్పు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు నేతృత్వంలో శనివారం రాత్రి 25 మందిని సత్కరించారు. కార్యక్రమంలో పాలిశెట్టి మురహరి, గుడివాక శేషబాబు, బండ్రెడ్డి శేషు, బండ్రెడ్డి బోసు, గుండాబత్తుని వెంకట సుబ్బారావు(ఫ్యాన్సీ), భోగాది చంద్రశేఖర్, గుండాబత్తుని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గురువారం గ్రామస్తులు గుడిలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పలువురు పెద్దలు, గ్రామ ప్రముఖులు అమ్మవారికి పూజలు జరిపారు.



ఊరేగింపులో గంగానమ్మ

ప్రత్యేక పూజలు

పామర్రు: జ్యేష్ఠమాసం గురువారం పురస్కరించుకుని స్థానిక సాయినగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మధ్యాహ్న హారతి నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం వచ్చిన భక్తులు అందరికీ అన్న ప్రసాదాన్ని సమర్పించామని ఆలయ ధర్మకర్త తమ్మా వినోద్‌రెడ్డి తెలిపారు.కార్యక్రమంలో సభ్యులు సాంబశివరావు, కాశీ,రమేష్, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్ నిఘా

ముదినేపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గుర్తించిన కొన్ని సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికీ పోలీస్ నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్సై డి.వెంకటకుమార్ తెలిపారు. ముదినేపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు అనంతరం కొన్ని గ్రామాల్లో గ్రూపుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురజ, చిగురుకోట తదితర గ్రామాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపులో ఉన్నందున గురజ మినహా ఇతర గ్రామాల్లో పోలీస్ పికెట్లు ఎత్తివేసినట్లు పేర్కొన్నారు. గురజలో ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని ఇక్కడ కూడా పికెట్ ఎత్తివేసేందుకు త్వరలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కోదండ రాముడికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నిజాంపేట బ్రాహ్మణ అగ్రహారంలోని శ్రీ కోదండ రామాలయం ప్రథమ వార్షిక ప్రతిష్టా మహోత్సవ పూజా కార్యక్రమాలు మూడో రోజు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం మూల మంత్రానుష్టాన హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం పాహిరామ ప్రభో సంగీత రూపకం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భద్రాచల రామదాసు కీర్తనలు మధురగాన సుధానిధి పోపూరి గౌరీనాథ్ బృందం లయబద్ధంగా ఆలపించారు. పలువురు కళాకారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ నెల 16వ తేదీ ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించాలని భక్తబృందం కోరింది.

ముమ్మరంగా వరి నారుమడుల ఏర్పాటు

తోట్లవల్లూరు: వరి నారుమడుల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. వాతావరణం చల్లబడటం, ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో సాగు పనులపై రైతులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా మాగాణి పొలాల్లో ఇప్పటికే తొలిదశ వేసవి దుక్కులను రైతులు పూర్తి చేశారు. గత కొద్ది రోజులుగా వరి నారుమడులను కూడా ఏర్పాటు చేస్తున్నారు. కాలువలకు ఇంకా సాగునీరు రానప్పటికీ, విద్యుత్ బోర్ల ద్వారా సాగునీటికి అవకాశం ఉన్న రైతులు నారుమడుల ఏర్పాటు పనులలో నిమగ్నమయ్యారు.



తోట్లవల్లూరులో ఏర్పాటు చేసిన వరి నారుమడి

సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

గుడివాడరూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సాయంత్రం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆయనకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ నమ్మి గెలిపించిన ప్రజల మేలు కోసం మనమందరం కష్టపడి పని చేయాలని సీఎం చంద్రబాబు సూచించారన్నారు. గుడివాడ అభివృద్ధికి సహకరించాలని సీఎంను కోరానని, దీనికి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.



సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రాజీనామా

గుడివాడ టౌన్: గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు ఎంవీ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన వ్యక్తిగత కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అప్పటి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తనపై పూర్తి విశ్వాసంతో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పదవిని ఆయన వదులుకుని తనను నియమించేందుకు జీఓ తెచ్చారన్నారు. గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర, కేంద్ర సహకారంతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అప్పట్లో కేవలం ఎనిమిది మంది వైద్యులు, కొద్ది సంఖ్యలో వైద్య సిబ్బందితో సేవలందిస్తున్న ఆస్పత్రిని 21 మంది వైద్యులు, 220 మంది ఇతర సిబ్బందితో అద్భుతంగా తీర్చి దిద్దామన్నారు. కరోనా సమయంలో 30 పడకలు ఏర్పాటు చేయడంతో పాటు ఆక్సిజన్ సిలిండర్లకు కొదువ లేకుండా చూస్తూ వందల మంది ప్రాణాలను కాపాడామన్నారు. అనంతరం రూ. 2.5 కోట్లతో రెండు ఆక్సిజన్ ప్లాంట్‌లు నిర్మించామన్నారు. రూ. 11 కోట్లతో 100 పడకల ఆస్పత్రి భవనం నిర్మాణం, రూ. 35 లక్షలతో లిఫ్ట్, రూ. 1.75 కోట్లతో సిటి స్కాన్ (మంజూరు), రూ. 75 లక్షలతో జిర్యాటిక్ వార్డు, రూ. 65 లక్షలతో టీబీ వ్యాధిగ్రస్తుల పూర్తి స్థాయి పరీక్ష యంత్రం ఏర్పాటు చేశామన్నారు. అనేక వసతులతో ఆస్పత్రిని అభివృద్ధి చేశామన్న తృప్తి తనకు, కొడాలి నానికి ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లి పవిత్ర కృష్ణానది ఒడ్డున వెలసిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7.20 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, ఆలయ శిఖరానికి 9.18 గంటలకు మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, శ్రీ స్వామివారి శాంతి కల్యాణం, అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. వేదపండితులు అగ్నిహోత్రి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో కుంభాభిషేకం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆలయ శిఖరానికి కృష్ణాజలాలతో మహా కుంభాభిషేకం

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

మండవల్లి: మండలంలోని కానుకొల్లు రైతు భరోసా కేంద్రంలో గురువారం వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి, వ్యవసాయాధికారి ఎస్‌కే జరీనా రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ ఎంటీయూ–7009, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 30 కేజీలు రూ.1,044కే సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. ఏఓ మాట్లాడుతూ రైతులందరూ వరి విత్తనాలు సూడోమోనాస్, లేదా బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. దీని వలన మొదటి 30 రోజుల వరకు పురుగుల బారినుంచి వరిపంటను కాపాడుకోవచ్చని తెలిపారు. కావాల్సిన రైతులు కానుకొల్లు, పెరికెగూడెం, గన్నవరం వీఏఏలను సంప్రదించాలన్నారు. వీఏఏ సంధ్య పాల్గొన్నారు.



సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ వెంకటమణి, ఏఓ జరీనా

ఎంపీపీ స్కూల్‌కు పైప్‌లైన్ కనెక్షన్

మండవల్లి: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చినట్లు సర్పంచ్ మెండా ఝాన్సీ గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో పైప్‌లైన్ కట్ చేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ యథావిధిగా కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, హెచ్‌ఎం రాహుల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



15 నుంచి శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఈ మేరకు గురువారం వివరాలు తెలుపుతూ ఆలయంలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 15వ తేదీ సుప్రభాతం, అగ్నిప్రతిష్టతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహిస్తారు. 16న ప్రత్యేక పూజలు, 17న ఉదయం 10 గంటలకు త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో శ్రీవారికి పంచామృత స్నపన, అష్టోత్తర శత కలశ స్నపన(108 కలశాలు), రాత్రి శ్రీవారి రాయబారోత్సవం జరుగుతుందన్నారు. 18వ తేదీ ఉదయం సువర్ణ పుష్పార్చన, రాత్రి 7 గంటలకు శ్రీవారికి తిరుక్కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. 19వ తేదీ ఉదయం లక్ష మల్లెల అర్చన, పుష్పయాగం, ఉదయం 11 గంటలకు అఖండ అన్నసమారాధన ఉంటుందన్నారు. 20వ తేదీ ఉదయం నిత్యహోమం, మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థోత్సవం, సాయంత్రం శ్రీవారి రథోత్సవం ధ్వజ అవరోపణ, పవళింపుసేక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.